సాక్షి
మహబూబాబాద్

శుక్రవారం । 5 । మే । 2023



క్రీస్తుసేవలో దేశానికే తలమానికం

ధర్మసాగర్ మండలం కరుణాపురంలో కొత్తగా నిర్మించిన క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరాన్ని గురువారం దైవజనులు పాల్సన్‌రాజు, జయప్రకాశ్ ప్రారంభించారు. - 8లో▸



మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసిన పోలీసులు

పరకాల పోలీసులు మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసి బాగు చేయించారు. ఆ తరువాత అతడిని తల్లికి అప్పగించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36.4^0 /24.3^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

జోరుగా మట్టి దందా!

- వెంచర్లు, గృహ నిర్మాణాలకు విక్రయం
- అనుమతులు లేకుండానే వ్యాపారం
- ప్రకృతి సంపదపై పట్టింపులేని అధికారులు



తొర్రూరు మండలం వెలికట్ట శివారులో మట్టిని తోడుతున్న జేసీబీ

తొర్రూరు: అక్రమార్కులు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. తవ్వుకునేది మట్టేకదా అని తక్కువ అంచనా వేస్తే పొరపాటే. ఆ మట్టితోనే లక్షల ఆదాయం గడిస్తున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలతో కాసుల పంట పండించుకుంటున్నారు. హిటాచీ, జేసీబీలతో యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. అధికారుల నిఘా వైఫల్యం కారణంగా చెరువులు, కుంటలు రూపు కోల్పోతున్నాయి. అనుమతుల్లేకుండా.. పగలు, రాత్రి తేడా లేకుండా ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వుకెళ్తున్నా అడిగేవారే లేరు. జిల్లా వ్యాప్తంగా ఈ దందా మూడు పూలు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

అక్రమ రవాణా..

పెరుగుతున్న నిర్మాణాలు, కొత్త వెంచర్ల అభివృద్ధి కోసం మట్టికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ట్రాక్టర్లు, టిప్పర్లతో యథేచ్ఛగా తరలిస్తూ...తమనెవరూ ఏం చేస్తారులే అన్నట్టుగా అక్రమాలకు పాల్పడుతున్నారు. డిమాండ్‌ను బట్టి ఒక్కో చోట ఒక్కో ధరతో అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారు. తొర్రూరులో ట్రాక్టర్ మట్టి రూ.700నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నారు. పలు మండలాల్లో ఇదే తరహా ధరలతో వ్యాపారం సాగిస్తున్నారు. తొర్రూరు మండలంలోని వెలికట్ట, మడిపల్లి, కంఠాయపాలెం, హరిపిరాల, వెంకటాపురం, నాంచారి మడూరు, కర్కాల తదితర గ్రామాల్లో జోరుగా మట్టి దందా సాగుతోంది. జిల్లాలోని పలు మండలాల్లో యథేచ్ఛగా ప్రకృతి వనరుల ధ్వంసం జరుగుతోంది. అయితే ఈ దందా వెనక అధికారులు ఉన్నారని, అక్రమార్కులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

పగలు, రాత్రి తేడా లేదు..



అక్రమంగా ట్రాక్టర్లలో తరలుతున్న మట్టి

మట్టి టిప్పర్లు, ట్రాక్టర్లు రోడ్డెక్కాయంటే ఇక మిగతా వాహనాలన్నీ ఆగిపోవాల్సిందే. ఎందుకంటే వాటి స్పీడుకు అడ్డు లేకుండా పోతోంది. ట్రక్కులపై పరదాలు కప్పకపోవడంతో దుమ్ము, దూళి విపరీతంగా ఎగిసిపడుతుంది. పగలు, రాత్రి తేడా లేకుండా వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అనుమతులు ఇలా...

మట్టి అవసరమైన వారు ముందుగా రెవెన్యూ, మైనింగ్ శాఖలకు దరఖాస్తు చేసుకుంటే ఆయా శాఖల వారు స్థలాన్ని పరిశీలించి అనుమతి ఇస్తారు. క్యూబిక్ మీటర్ మట్టికి రూ.20చలానా చెల్లించి మట్టి తోలకాలు చేయాలి. ఒక లారీలో సుమారు 10 ఘనపు మీటర్లు, ట్రాక్టర్‌లో 3ఘనపు మీటర్ల మట్టి పడుతోంది. ఒకవేళ అనుమతి తీసుకున్న దానికంటే ఎక్కువగా మట్టి తోలకాలు సాగిస్తే లోకాయుక్తలో ఫిర్యాదు చేస్తే వ్యాపారికి జరిమానా విధిస్తారు. ప్రస్తుతం మట్టి తోలే వారెవరికి అనుమతులు లేవని సమాచారం. ఇంకా మట్టి తోలే వాహనాల్లో చాలా వరకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేవు.

చర్యలు తీసుకుంటాం

మట్టిని ఇతర ప్రాంతాలకు రవాణా చేయాలంటే రెవెన్యూ, మైనింగ్ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి. అక్రమంగా మట్టి తరలించే వాహనాలను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. మైనింగ్ శాఖ అనుమతినిచ్చినా రెవెన్యూ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా తరలించడానికి వీలు లేదు.

- నాగేంద్ర ప్రసాద్, తొర్రూరు తహసీల్దార్

నేడు వరంగల్ నగరంలో మంత్రి కేటీఆర్ పర్యటన

- మధ్యాహ్నం 2.45 గంటల నుంచి రాత్రి వరకు కార్యక్రమాలు
- రూ.181.45 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- వరంగల్, హనుమకొండ లో పార్టీ కార్యకర్తలతో సమావేశాలు
- సాయంత్రం కాజీపేట సెయింట్ గాబ్రియల్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగసభ



కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినయ్‌భాస్కర్, కలెక్టర్లు

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ఐటీ, పురపాలక, పరిశ్రమలశాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) శుక్రవారం వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ మేరకు పార్టీ యంత్రాంగం, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హనుమకొండ ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, సీపీ, ఇతర శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా మహానగరంలో బందోబస్తు, భద్రత ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పర్యవేక్షించారు. కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు భారీగా ఏర్పాట్లు చేశారు. పార్టీ జెండాలు, స్వాగత తోరణాలు, బ్యానర్లతో హసన్‌పర్తి నుంచి మడికొండ వరకు రోడ్లన్నీ గులాబీమయమయ్యాయి.

ఏర్పాట్ల పరిశీలన..

కేటీఆర్ పాల్గొనే కార్యక్రమాల ఏర్పాట్లను గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అరూరి రమేష్, సీపీ ఏవీ రంగనాథ్, కలెక్టర్‌లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య తదితరులు పరిశీలించారు. కిట్స్ కళాశాల, సమ్మయ్య నగర్ మోడల్ వైకుంఠధామం, సైన్స్ సెంటర్, ఫాతిమా నగర్‌లోని సమావేశ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

కేటీఆర్ పర్యటన ఇలా..

- శుక్రవారం మధ్యాహ్నం 2.45గంటలకు హుస్నాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా హసన్‌పర్తి కిట్స్ కళాశాల ఆవరణకు చేరుకుంటారు.
- 2–45 నుంచి 4–30 వరకు ఆ కళాశాలలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించి ఎగ్జిబిట్లను పరిశీలిస్తారు, హెచ్‌ఓడీలు, విద్యార్థులతో ఇంటరాక్షన్, కేసీఆర్ కప్ ప్రదానోత్సవం ఉంటుంది.
- 4.30 గంటలకు హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమంలో పాల్గొంటారు.
- సాయంత్రం 5 గంటలకు లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ స్కూల్లో సైన్స్‌పార్క్ ప్రారంభం, పలు అభివృద్ధి /ఐటీ శంకుస్థాపనలు చేస్తారు.
- 5.30 గంటలకు వరంగల్ నాయుడు పెట్రోల్ పంప్ వద్ద పార్టీ కార్యకర్తలతో సమావేశం
- 6 గంటలకు హనుమకొండ ఇందిరానగర్‌లోని రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న ఇంటికి చేరుకుంటారు.
- 6.15 గంటలకు నగరంలోని 57వ డివిజన్ గాంధీనగర్‌లోని మోడల్ వైకుంఠధామం ప్రారంభోత్సవం
- 6.30 గంటలకు సెయింట్ గాబ్రియల్ స్కూల్ మైదానంలో బహిరంగ సభ
- రాత్రి 8.00 గంటలకు రోడ్డుమార్గాన హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

న్యూస్‌రీల్

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

- డీఈఓ రామారావు



కేసముద్రం: ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ రామారావు అన్నారు. గురువారం కేసముద్రంస్టేషన్ జెడ్పీఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడారు. నెలరోజుల పాటు జరిగే ఈ సమ్మర్‌క్యాంపులో 8, 9, 10వ తరగతులకు చెందిన విద్యార్థులకు గణితం, సైన్స్, ఇంగ్లిష్‌లో కనీస సామర్థ్యాలు బోధిస్తారన్నారు. క్రీడలు, పాటలు పాడటంలో ఆసక్తి ఉన్న పిల్లలకు శిక్షణ ఇస్తారన్నారు. ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు క్యాంపు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీజీఈ శ్రీరాములు, నోడల్ ఆఫీసర్ కొత్త జగన్మోహన్‌రెడ్డి, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీలకు కనీస వేతనం చెల్లించాలి

తొర్రూరు రూరల్: గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ యాకూబ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చింతలపెల్లి, వెలికట్ట గ్రామాల్లో సందర్శించిన కార్మిక సంఘం నాయకులు ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ.. ప్రతిరోజు కనీస వేతనం రూ.272 చెల్లించాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ప్రతీ ఏడాది 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు పల్లె పద్మ, సోమన్న, కూలీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు బోర్డుల ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై సాక్షి దిన పత్రికలో 'అంగన్‌వాడీలు.. అస్తవ్యస్తం' అనే శీర్షికన గురువారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. జిల్లా కేంద్రంలోని పలు సెంటర్లకు కొత్త బోర్డులు ఏర్పాటు చేశారు. సిగ్నల్‌కాలనీ కేంద్రంలోని పరిసరాలను శుభ్రం చేయించారు. కేంద్రాల నిర్వహణ, తదితర విషయాలపై పలు కేంద్రాల టీచర్లు, ఆయాలపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

108వాహనంలో ప్రసవం



కేసముద్రం: పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణి 108వాహనంలో ప్రసవించిన ఘటన మండలంలోని అన్నారం గ్రామ సమీపంలో గురువారం జరిగింది. తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన ఆరే సౌజన్య అనే గర్భిణి ఉదయం పురిటినొప్పులతో బాధపడుతుండగా, ఆమెను 108 వాహనంలో మానుకోటలోని జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా.. అన్నారం గ్రామ సమీపంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ లకావత్ నరేష్, పైలెట్ పప్పుల వెంకన్న సమయస్ఫూర్తితో నార్మల్ డెలివరీ చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత తల్లి, బిడ్డలను జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జాతీయ యూత్ పార్లమెంట్‌కు విద్యార్థి

కేయూ క్యాంపస్: ఈ నెల 9న న్యూఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి యూత్ పార్లమెంట్ క్యాంపునకు హనుమకొండలోని ఆర్ట్స్అండ్ సైన్స్ కళాశాల విద్యార్థి అభిషేక్ ఎంపికయ్యాడు. ఈ మేరకు గురువారం కళాశాలలో అభిషేక్‌ను ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, జి.హనుమంతు, ఎస్.శ్రీదేవి, కనకయ్య తదితరులు అభినందించారు.

నిరంతర సాధనతోనే ఉత్తమ ఫలితాలు

- కలెక్టర్ శశాంక



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: నిరంతర సాధనతోనే ఉత్తమ ఫలితాలు పొందుతామని కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీశాఖ ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులకు స్వచ్ఛ సర్వేక్షన్‌పై అవగాహన కార్యక్రమాన్ని సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉత్తమ పంచాయతీ అవార్డులు రావాలని అనుకుంటే సరిపోదని, దానికి ప్రణాళిక ఉండాలన్నారు. దీనికి ముందుగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. జిల్లాస్థాయిలో అధ్యయన బృందం ఏర్పాటు చేయాలని, అంశాల వారీగా గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. అధికారులు గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, జెడ్పీ సీఈఓ రమాదేవి, డీపీఓ ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జాప్యం చేస్తే చర్యలు తప్పవు

పెద్దవంగర: ఆరుగాలం కష్టించి రైతు ధాన్యం పండిస్తే సకాలంలో కొనుగోళ్లు చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని, రైతులను ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కలెక్టర్ శశాంక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని చిన్నవంగర, బీసీ తండా, బావోజీ తండాల్లో పర్యటించి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ కొనుగోలు కేంద్రానికి వచ్చిన సమయంలో సెంటర్ ఇన్‌చార్జ్ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్, తహసీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఏఈఓ మానస, పీఏసీఎస్ సీఈఓ మురళి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ మానసపుత్రిక 'కల్యాణలక్ష్మి'

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కురవి: సీఎం కేసీఆర్ మానసపుత్రిక కల్యాణలక్ష్మి పథకం అని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కురవి, సీరోలు, డోర్నకల్ మండలాలకు చెందిన వివిధ గ్రామాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆడబిడ్డల మేనమామ సీఎం కేసీఆర్ అని కొనియాడారు. సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. డోర్నకల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని మళ్లీ ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు గుగులోత్ పద్మావతిరవినాయక్, డీఎస్ బాలునాయక్, జెడ్పీటీసీ కమల, తహసీల్దార్లు విజయ్‌కుమార్, ఇమ్మానియేల్, ఎంపీడీఓ సరస్వతి, ఆత్మ చైర్మన్ తోటలాలయ్య, వైస్‌ఎంపీపీ దొంగలి నర్సయ్య, బీఆర్‌ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, ఎర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, గార్లపాటి వెంకటరెడ్డి, వాంకుడోత్ వీరన్న, భరద్వాజ్‌రెడ్డి, రాజునాయక్ పాల్గొన్నారు.

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన తర్వాత ఎమ్మెల్యే రెడ్యానాయక్ దీక్షలు చేపడుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల శిబిరం వద్దకు వెళ్లారు. వారు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



వినియోగదారులకు విద్యుత్ పరికరాలు అందిస్తున్న సీజీఎం మధుసూదన్ తదితరులు

తొర్రూరు: విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులు, విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ సీజీఎం మధుసూదన్ అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, ఎస్ఈ నరేష్‌లతో కలిసి సీజీఎం మాట్లాడారు. విద్యుత్‌ను ఆదా చేయడంతో పాటు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బిల్ స్టాఫ్ సర్వీసులను, ఇండస్ట్రియల్ సర్వీస్‌లను తరచూ తనిఖీ చేయాలన్నారు. కాలిన మీటర్లను మార్చాలని సూచించారు. చౌర్యాన్ని అరికట్టి కంపెనీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందుతుందని, విద్యుత్ సరఫరాలో 40 శాతం వ్యవసాయానికే వినియోగిస్తున్న రాష్ట్రం తెలంగాణనే అన్నారు. అనంతరం స్థానికులకు విద్యుత్ పరికరాలు అందించారు. కార్యక్రమంలో డీఈ మధుసూదనాచారి, ఏడీ చలపతిరావు, ఏఈలు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతు పండించిన ప్రతి గింజనూ కొంటాం

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



బీసీ తండాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర: రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని బంగారుచెలిమి తండాలో భాగ్యలక్ష్మి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ పద్మతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు పోచంపల్లి గ్రామంలో సర్పంచ్ సుదగాని యాదలక్ష్మితో కలిసి రామాలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం అవుతాపురం గ్రామంలో సెర్ప్, స్త్రీనిధి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ శిబిరాన్ని సర్పంచ్ మంజులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. మక్కలకు రూ.1,962 మద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని తెలిపారు. తడిసిన ధాన్యానికి కూడా ప్రభుత్వ మద్దతు ధర చెల్లిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. తిర్మలగిరి నుంచి హరిపిరాల మీదుగా పెద్దముప్పారం వరకు డబుల్‌రోడ్డును రూ.20 కోట్లతో మాంజూరు చేసినట్లు వెల్లడించారు. దేవతల ఒడిలో ప్రజలు సుభిక్షంగా ఉంటారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉంటే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఆలయ నిర్మాణానికి రూ.10లక్షలు తనవంతు సాయమందిస్తానన్నారు. మహిళా అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని పేర్కొన్నారు. మహిళలకు వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు రూ. 5.10కోట్లతో మొదటి సారిగా పాలకుర్తి నియోజకవర్గంలో ఉచితంగా కుట్టు శిక్షణ ప్రారంభించి, కుట్టు మిషన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరంగా దుస్తుల ఆర్డర్ వస్తే శిక్షణ పొందిన వారికే అవకాశం కల్పిస్తామన్నారు. వరంగల్‌లోని టెక్స్‌టైల్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక అభివృద్ధితోనే కుటుంబం, దేశం పురోగతి సాధిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గంలోని కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమేష్, ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ జ్యోతిర్మయి, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్య శర్మ, పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్, వైస్ ఎంపీపీ కల్పన, డీసీఓ ఖుర్షీద్, అదనపు పీడీ వెంకట్, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపు ప్రధానం

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

మహబూబాబాద్ రూరల్: డ్రైవర్లకు కంటి చూపు ప్రధానమని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కంటి పరీక్ష చేయించుకున్న సిబ్బందితో మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో డ్రైవరుతో పాటు వాహనంలో ఉన్న సిబ్బంది, అధికారుల ప్రాణాలు డ్రైవర్ల చేతిలో ఉంటాయన్నారు. అంతే కాకుండా వాహనాలను వేగంగా నడపకూడదన్నారు. అవసరానికి మించి పోలీస్ సైరన్ వాడకూడదని, విధులతో పాటు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి ఒకసారి తప్పకుండా ఫుల్ బాడీ చెకప్ చేయించుకోవడం మంచిదని సూచించారు. మొత్తం 65 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కంటి చూపు సమస్య ఉన్న వారు కళ్లద్దాలు తప్పనిసరిగా వాడాలన్నారు. వారికి ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఆర్.ఐ (ఎంటీఓ) పూర్ణచందర్, ఆర్ఐ సురేష్ పాల్గొన్నారు.

మహిళలు, బాలికలకు అండగా షీటీమ్స్



మాట్లాడుతున్న షీటీం ఎస్సై సునంద

మహబూబాబాద్ రూరల్: మహిళలు, బాలికలు, విద్యార్థినులకు షీటీమ్స్ అండగా ఉంటాయని షీటీం ఎస్సై సునంద అన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సునంద మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా, ఉమెన్‌సేఫ్టీ, సెక్యూరిటీ, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు, క్యూఆర్‌కోడ్ దరఖాస్తు, డయల్ 100, 1098, 1930, షీటీమ్స్ వాట్సాప్ 79011 42009, 87126 56935 నంబర్లపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో ప్రస్తుతం జరుగుతున్న నేరాలు, వాటి బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఏదైనా సమాచారం అడిగితే చెప్పకూడదని, ఖాతాల పాస్‌వర్డ్‌లు, ఖాతాల గురించి, ఫొటోలు, వీడియోలు, ఇతర సమాచారాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, వైస్ చైర్మన్ గుండా రాజశేఖర్, సెక్రటరీ ఎండీ షంషీర్, షీటీం కానిస్టేబుళ్లు అరుణ, రమేష్, ఊర్మిళ, భరోసా టీం లీగల్ అడ్వైజర్ సాహితి తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రం నెహ్రూసెంటర్ లోని ఏపీజీవీపీ బ్యాంకు సమీపంలో తాగునీటి పైపులైన్ లీకేజీ కావడంతో రోడ్డుపైకి నీరు చేరుతోంది. దీంతో నీరంతా రోడ్డును కమ్మేయగా.. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా నీరు వృథాగా పోతున్నా.. అటువైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. కాగా మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పైప్‌లైన్ నుంచి లీకవుతున్న తాగునీరు



రోడ్డును కమ్మేసిన నీరు

కాజీపేట జంక్షన్‌లో రైల్వే సేఫ్టీ ఆఫీసర్ తనిఖీలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో గురువారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌ఓ) రవీంద్రనాథ్‌రెడ్డి తనిఖీలు చేపట్టారు. రైల్వే డ్రైవర్ల కార్యాలయం, డ్రైవర్ల విశ్రాంతి కార్యాలయం, డిప్యూటీ స్టేషన్ మాస్టర్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం రైల్వే యార్డులో రైలు ప్రమాదాలు జరిగితే యుద్ధప్రాతిపదికన తరలివెళ్లే యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, ఎంఆర్‌వీ ట్రైన్‌ను సందర్శించి అందులోని అన్ని యంత్ర సామగ్రి, పరికరాలు సక్రమంగా ఉన్నాయా? లేదా అని పరిశీలించి తెలుసుకున్నారు. అనంతరం కాజీపేట రైల్వే అధికారులతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో కాజీపేటకు చెందిన వివిధ రైల్వే విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రేపు విజ్ఞానోత్సవ్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 6న కళాశాల విజ్ఞానోత్సవ్–23ను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య గురువారం తెలిపారు. ఆడిటోరియంలో నిర్వహించే ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేయూ వీసీ తాటికొండ రమేశ్, శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగ్ కలెక్టర్ పి.ప్రావీణ్య, కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, గాయకుడు జయరాజ్, బలగం సినిమా నటుడు అరసం మధుసూదన్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్: కేయూలోని వివిధ విభాగాల పరిశోధకులు ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి తెలిపారు. ఫీజు రూ.930 అని, అపరాధ రుసుము లేకుండా ఈ నెల16వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చని పేర్కొన్నారు.

‘భగీరథ’ నీటితో వ్యాపారం!

- కల్లెం సమీపంలో భారీ వాటర్ ప్లాంట్
- రోజుకు లక్ష లీటర్ల నీళ్ల అనుమతికి దరఖాస్తు
- పరిశ్రమల నిబంధన పేరుతో వాటర్ బాటిళ్ల తయారీ కంపెనీకి అనుమతులు?


కల్లెం సమీపంలో ఏర్పాటు చేసిన భారీ వాటర్ ప్లాంట్

లింగాలఘణపురం: ప్రభుత్వం ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీరు అందించాలనే లక్ష్యంతో మిషన్ భగీరథను ప్రారంభించింది. ఈ నీటితో వ్యాపారం చేసేందుకు లింగాలఘణపురం మండలం కల్లెం సమీపంలో భారీ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. రోజుకు లక్ష లీటర్ల నీటిని తీసుకునేందుకు అనుమతి కోసం రూ.26 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. వేసవిలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తాగునీటికి తిప్పలు పడుతున్న నేపథ్యంలో వాటర్ బాటిళ్ల తయారు చేసుకునేందుకు రోజుకు లక్ష లీటర్ల నీటిని ఇచ్చేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పూర్తి స్థాయిలో శుద్ధి చేసి నీటిలో ఉండాల్సిన లవణాల శాతం(టీడీఎస్)ను తీసుకొచ్చి నేరుగా ప్రజలు తాగేందుకు సిద్ధమైన నీటిని వాటర్ బాటిళ్ల తయారీ కంపెనీకి అమ్మడమేంటో అర్థం కావట్లేదు.

బోర్లలో సరిపడా నీళ్ల రాక.

ఈభారీ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు సదరు కంపెనీ యాజమాన్యం స్థలాన్ని కొనుగోలు చేసి అందులో బోర్లు వేసింది. నీళ్లు సరిగ్గా పడకపోవడంతో మిషన్ భగీరథ నీటి కోసం దరఖాస్తు చేసుకుంది. నిర్వాహకులు అందుకు సంబంధించిన పైపులైన్‌లు కూడా వేసుకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే.. రోజుకు లక్ష లీటర్ల నీరు తీసుకునేందుకు అక్కడే మీటర్లను బిగించి ఓ వ్యక్తిని కూడా నియమించినట్లు సమాచారం.

పరిశ్రమలకు పది శాతమే అనుమతి..

మిషన్ భగీరథ నీటిలో పది శాతం పరిశ్రమలకు ఇచ్చేందుకు అనుమతి ఉందనే నిబంధనపై వాటర్ ప్లాంట్‌కు రోజూ లక్ష లీటర్లు ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నారు. పరిశ్రమలంటే ఏదైనా ఉత్పత్తి రంగానికి సంబంధించిన ఫ్యాక్టరీ అయ్యి ఉండాలి. ఇక్కడ మాత్రం కేవలం వాటర్ బాటిళ్లు తయారు చేసే కంపెనీలకు మిషన్ భగీరథ నీరు అనుమతి ఇవ్వొచ్చా? అనే అంశం చర్చనీయాంశమైంది. పూర్తి స్థాయిలో శుద్ధి చేయబడి ఉండాల్సిన మినరల్స్ శాతం (టీడీఎస్) నీటిని సదరు కంపెనీ తీసుకొని అందులో మరిన్ని మినరల్స్ కలిపి వాటర్ బాటిళ్లను తయారు చేసి అమ్ముకోనుంది. ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తోంది.

ఆదాయం పెంచుకునేందుకు..

నిబంధన మేరకు ఇప్పటికే సదరు కంపెనీ యాజమాన్యం రోజూ లక్ష లీటర్ల నీటికి దరఖాస్తు చేసుకుంది. వెయ్యి లీటర్లకు రూ.90ల చొప్పున నీటిని ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి అనుమతికి ప్రతిపాదనలు పంపించాం. రాగానే.. అక్కడే మీటరు బిగించి ఇవ్వడం జరుగుతుంది.

– వి.శ్రీనివాసులు, ఈఈ, మిషన్ భగీరథ

నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకున్నాం..

నిబంధనల మేరకే మిషన్ భగీరథ నీటికి దరఖాస్తు చేసుకున్నాం. అందుకు సంబంధించి రూ.26 లక్షలు చెల్లించడం జరిగింది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే.. నీటిని తీసుకుంటాం. భగీరథ నీటిలో మరిన్ని మినరల్స్ యాడ్ చేసి బాటిళ్లు తయారు చేయడం జరుగుతుంది.

– శ్రీనివాస్‌రెడ్డి, కంపెనీ మేనేజర్

నూతన జిల్లాల వారీగా ఖాతాల బదిలీ

హన్మకొండ: పరిపాలన సౌలభ్యానికి జిల్లాల పునర్విభజన, నూతన జిల్లాల ఏర్పాటుతో బోధన, బోధనేతర ఉద్యోగుల నూతన జిల్లాల కేటాయింపు ప్రక్రియ జరిగింది. పూర్వ వరంగల్ జిల్లా స్థాయిలో జిల్లా ప్రజాపరిషత్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలు పూర్వ వరంగల్ జెడ్పీలో నిర్వహించారు. జిల్లాల పునర్విభజన జరిగినా పూర్వ జెడ్పీ స్థాయి నూడల్ జెడ్పీగా హనుమకొండ జెడ్పీ ఇప్పటి వరకు జీపీఎఫ్ ఖాతాల నిర్వహణ చూస్తోంది. నూతన జిల్లాల ఏర్పాటు ఉపాధ్యాయులు, ఉద్యోగుల కేటాయింపులు పూర్తి కావడంతో వారి సౌలభ్యం కోసం జిల్లాల వారీగా ఖాతాల విభజన చేపట్టారు. 10 ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి ఖాతాల విభజన ప్రక్రియ చేపట్టారు. నోడల్ సీఈఓ, హనుమకొండ జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్‌రావు ఒక్కో టీమ్‌కు ఇద్దరు చొప్పున 10 టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఈటీమ్‌లు నూతన జిల్లాల్లోని ఉపాధ్యాయులు, ఉద్యోగుల వారీగా ఖాతాల బదిలీ ప్రక్రియను చేపట్టారు. రెండు నెలల్లో ఈప్రక్రియను పూర్తి చేయనున్నారు. పూర్వ వరంగల్ జిల్లాలో 8,150 బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. వీరి జీపీఎఫ్ ఖాతాలను జూన్ 30 వరకు నూతన జిల్లాలకు బదిలీ చేస్తారు. నూతన జిల్లాల వారీగా ప్రస్తుతం హనుమకొండ జిల్లాలో 1,679 మంది, వరంగల్‌లో 1,912, జనగామలో 1,827, మహబూబాబాద్‌లో 1,827, జేఎస్ భూపాలపల్లిలో 489, ములుగులో 476, సిద్దిపేట జిల్లాలో 294 సిబ్బంది ఉన్నారు.

లావాదేవీల నిలిపివేత

నూతన జిల్లాల వారీగా జీపీఎఫ్ ఖాతాల విభజన ప్రక్రియ పూర్తయ్యే వరకు లావాదేవీలు పూర్తిగా నిలిపేశాం. ఈనెల 1 నుంచి జూన్ 30 వరకు జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, రుణాలు, అడ్వాన్స్‌లకు దరఖాస్తుల స్వీకరణ నిలిపివేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు సహకరించాలి.

– వెంకటేశ్వర్ రావు, జెడ్పీ సీఈఓ, హనుమకొండ

వృద్ధురాలిపై హత్యాయత్నం

- పరిస్థితి విషమం

కురవి: ఇద్దరు వృద్ధులు సహజీవనం చేస్తున్నారు. పది రోజుల నుంచి ఇద్దరికీ గొడవలు జరుగుతున్నాయి. కోపంతో 70 ఏళ్ల షేక్ ఖాజామియా అతడితో సహజీవనం చేస్తున్న 60 ఏళ్ల గుండగాని మంగమ్మని రోకలి బండతో తలపై మోది హత్యాయత్నం చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తట్టుపల్లిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై బి.రాము తెలిపిన వివరాల ప్రకారం.. తట్టుపల్లికి చెందిన గుండగాని మంగమ్మ 30 ఏళ్ల నుంచి అదే గ్రామానికి చెందిన షేక్ ఖాజామియాతో ఒకేఇంట్లో సహ జీవనం చేస్తోంది. కొన్ని నెలల నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగమ్మ తనకు కళ్లు కనిపించడంలేదని, తన బిడ్డల వద్దకు వెళ్తానని ఖాజామియాతో చెప్పింది. దీంతో ఖాజామియా ఈసమయంలో తనను ఎవరు చూసుకుంటారని ఆమెతో గొడవకు దిగాడు. అయితే కొద్దిరోజుల క్రితం ఖాజామియా కొడుకులు వచ్చి ఇద్దరికీ సర్దిచెప్పారు. దీంతో ఖాజామియా ఆమెపై కోపంతో బుధవారం రాత్రి రోకలిబండతో తలమీద మోదాడు. దీంతో ఆమె తల పగిలిపోయింది. వెంటనే మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేశారు. అదే రాత్రి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మంగమ్మ కుమార్తె రాంపల్లి రేణుక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

పెద్దవంగర: అప్పుల బాధతో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన జక్కుల మంజుల(40) బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. పెద్దవంగర మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన మంజులకు ఇరవై ఏళ్ల క్రితం మైలారం గ్రామానికి చెందిన శ్రీనుతో వివాహం జరిగింది. వీరికి ఒక కూమారుడు, కుమార్తె. బ్రెయిన్ ట్యూమర్‌తో భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. భర్త చికిత్స సమయంలో మంజుల రూ. 3 లక్షల వరకు అప్పు చేసింది. తీసుకున్న అప్పులకు వడ్డీ పెరుగుతుండడం, కుటుంబ పోషణ భారమవడంతో మంజుల మనస్తాపం చెందింది. బుధవారం పుట్టింటికి వచ్చి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


యాకు (ఫైల్)

చిన్నగూడూరు: విద్యుత్ షాక్‌తో మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం తుమ్మల చెరువు తండా శివారు మల్యా తండాకు చెందిన మాలోత్ యాకు(42) గురువారం మృతి చెందాడు. యాకు వ్యవసాయం చేస్తుంటాడు. గురువారం తన ఇంటి మోటారు మరమ్మతు చేసే సమయంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానిక ఎస్సై సంతోశ్‌కుమార్ ఘటనాస్థలిని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధితకుటుంబానికి సానుభూతి తెలిపారు.

జ్వరంతో వ్యక్తి ..


రామ్‌కుమార్ (ఫైల్)

వాజేడు: జ్వరంతో బాధపడుతూ మండలంలోని కొంగాల గ్రామానికి చెందిన యాలం రామ్‌కుమార్(40) గురువారం మృతి చెందాడు. రామ్‌కుమార్ వారం నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. మందులు వాడడంతో జ్వరం తగ్గిందని భావించాడు. ఛత్తీస్‌గఢ్‌లో బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లికి వెళ్లి మూడ్రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. బుధవారం రాత్రి అతడికి మళ్లీ జ్వరం వచ్చింది. గమనించిన బంధువులు భద్రాచలం ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యం చేస్తుండగానే రామ్‌కుమార్ మృతి చెందాడు.

అదనపు కట్నం కోసం వేధించిన ఒకరిపై కేసు

చెన్నారావుపేట: అదనపు కట్నం కోసం వేధించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ గురువారం తెలిపారు. మండలంలోని తిమ్మారాయినిపహడ్ గ్రామానికి చెందిన దొనికేని స్వాతికి మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని కొమ్ములవంచకు చెందిన దొనికేని యాకయ్యతో 2012లో వివాహం జరిగింది. అప్పటి నుంచి యాకయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకురావాలని స్వాతిని వేధింపులకు గురిచేస్తున్నారు. ఈవిషయంపై బాధితురాలు స్వాతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

శిశువును విక్రయించేందుకు యత్నం

- ఒకరిపై కేసు

రాయపర్తి: ఐదురోజుల ఆడ శిశువును విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గురువారం స్థానిక ఎస్సై బండారి రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సన్నూరు గ్రామానికి చెందిన గడ్డమీది యాకమల్లు ఓ మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఆ మహిళ ఐదు రోజుల క్రితం ఆడ శిశువుకు జన్మనిచ్చింది. యాకమల్లుకు ఇప్పటికే ఆడపిల్లలు ఉండడంతో శిశువును గురువారం విక్రయించేందుకు ప్రయత్నిస్తూ గ్రామ శివారులో కనిపించాడు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మోదె మాధవితోపాటు, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి కలిసి ఘటనా స్థలికి వెళ్లి శిశువును తల్లికి అప్పగించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మోరంచ వాగులో వ్యక్తి గల్లంతు


వెంకటేశ్ (ఫైల్)

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాక గ్రామ శివారులో ఉన్న మోరంచ వాగును దాటుతూ ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతయ్యాడు. ఈఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన కేతిరి వెంకటేశ్(30) ఈనెల 1న తన అత్తగారి గ్రామమైన గుడాడ్‌పల్లికి వెళ్తుండగా నైన్‌పాక శివారులో ఉన్న మోరంచపల్లి వాగు దాటుతూ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. అతడి ఆచూకీ కోసం పోలీసులు మోరంచ పరిసరాల్లో గాలించినా ఫలితం లేదు. వెంకటేశ్ తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. వెంకటేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్రీస్తు సేవలో దేశానికే తలమానికం


చర్చి ప్రారంభానికి వచ్చిన విశ్వాసులు


మందిరాన్ని ప్రారంభిస్తున్న దైవజనులు

ధర్మసాగర్: ఏసు క్రీస్తు ప్రార్థన మందిరం క్రీస్తు సేవలో దేశానికే తలమానికంగా నిలుస్తోందని కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్‌రాజ్, రెవరెండ్ డాక్టర్ గోపు జయప్రకాశ్ అన్నారు. ధర్మసాగర్ మండలం కరుణాపురంలో నిర్మించిన క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరాన్ని గురువారం దైవజనులు పాల్సన్‌రాజ్, జయప్రకాశ్ కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసియా ఖండంలో అతిపెద్ద చర్చిని కరుణాపురంలో నిర్మించడం దేవుని ప్రార్థన సంకల్పమేనన్నారు. జీవితాంతం దేవుడి సేవలో కొనసాగుతామన్నారు. యూఎస్‌ఏ ఇంటర్నేషనల్ స్పీకర్ రెవరెండ్ డాక్టర్ స్టీవ్ మున్సే బైబిల్ సందేశం ఇచ్చారు. పాల్సన్‌రాజ్, జయప్రకాశ్‌లు ప్రత్యేక వాహనంపై కేరళ బ్యాండ్ బృందంతో పోలీసుల బందోబస్తు, క్రీస్తు విశ్వాసులతో తమ ఇంటి నుంచి కరుణాపురం పురవీధుల మీదుగా క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరానికి చేరుకొని క్రీస్తు జెండాను ఆవిష్కరించారు. లక్షలాది మంది విశ్వాసులకు భోజనాలు ఏర్పాటు చేశారు. రెవ.డాక్టర్ ఎస్.జోసెఫ్ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, దైవజనుడు బ్రదర్ జడ్సన్ అబ్రహం, రెవ.డాక్టర్ కె.ఎం.జాన్, సేవాభారత్ ఫౌండర్ డాక్టర్ జె.చిరంజీవి, టీసీఎఫ్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.ఐజక్, టీసీఎఫ్ చైర్మన్ బిషప్ జాన్‌మార్కెండేయ, పాస్టర్ ఎం.పరంజ్యోతి, పాస్టర్ టి.డేవిడ్, బి.వినయ్‌కుమార్, రెవ.నల్ల డేవిడ్, జి.ఎలిషా, రెవ.యు.డేవిడ్, పాస్టర్ కోర్నెల్, పాస్టర్ క్లింటన్, ఇమ్మానియేల్, రెవ.డాక్టర్ జె.థామస్, సంగాల డేవిడ్, పాస్టర్లు, దేశ నలుమూలల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

లైన్ పెట్రోలింగ్ నిర్వహించాలి: ఎన్పీడీసీఎల్ సీఎండీ

హన్మకొండ: అధికారులు, ఉద్యోగులు లైన్ పెట్రోలింగ్ నిర్వహించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని క్యాంపు కార్యాలయం నుంచి ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల ఎస్‌ఈలు, డీఈ, ఏఈ, ఎస్ఏఓ, ఏఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షించారు. ఇందులో సీఎండీ గోపాల్‌రావు మాట్లాడుతూ.. 33 కేవీ ఇంటర్ లింకింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విధిగా సబ్‌స్టేషన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. దత్తత గ్రామాల్లో గుర్తించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు సదర్‌లాల్, అశోక్‌కుమార్, మోహన్‌రావు, రాజు చౌహాన్, రవీంద్రనాథ్, డీఈ ఐటీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వనరులను ధ్వంసం చేస్తున్న ప్రభుత్వం

- మావోయిస్టు పార్టీ జేఎంఎంపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

మంథని: త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ ప్రభుత్వం తెలంగాణలో ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు పోలీస్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతిపక్షాలు, ప్రజా ఉద్యమాలను కాలరాస్తోందని జయశంకర్–మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. అధికార పార్టీ రియల్ వ్యాపారుల లాభాల కోసం కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తీస్తున్నారని తెలిపారు. మిడ్ మానేరులో ఇసుకను తీయడంతో నీటి ఎద్దడి ఏర్పడి పంటలు పండవని కేసు వేసిన తర్వాత మైనింగ్ ఆపేసిందని పేర్కొన్నారు. అధికార పార్టీ అండదండలతో సుల్తానాబాద్, వీణవంక నుంచి గోదావరి కలిసే వరకు ఇసుకను తీసి అమ్ముతున్నారన్నారు. కాళేశ్వరం దగ్గర గోదావరిలో అక్రమంగా రోడ్డు పోసి ఇసుకను తీసుకెళ్తున్నారన్నారు. పెద్దపల్లి, జయశంకర్, ములుగు అడవులు, గుట్టలు, చెరువుశిఖం భూముల్లోని మట్టి తీసి రోడ్లు, ప్రభుత్వ భవనాలు, ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల్లేకుండా కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తూ ప్రకృతిని ధ్వంసం చేస్తున్నారని స్పష్టం చేశారు.

‘నకిలీ’ ఉదంతానికి కేటీఆర్ బాధ్యత వహించాలి

- బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్


మాట్లాడుతున్న దాసు సురేశ్

పరకాల: నకిలీ చేనేత ఉదంతాన్ని ఇప్పటికే ఖండించిన మంత్రి కేటీఆర్ నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. పరకాల చేనేత సహకార సంఘ భవనాన్ని ఆయన గురువారం సందర్శించి చేనేత కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో వేల కోట్ల రూపాయల నకిలీ చేనేత దందాపై ప్రభుత్వం పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. వరంగల్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు పట్టుబడిన షాపింగ్ మాల్‌ను మూసివేయించకుండా మంత్రి కేటీఆర్ వరంగల్‌కు ఎలా వస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ జిల్లా డైరెక్టర్ గాదె శంకరయ్య, చేనేత సహకార సంఘం సభ్యులు రాజేందర్, మార్త భిక్షపతి, దాసరి భిక్షపతి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి

- టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్


సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల రాజేందర్

హన్మకొండ అర్బన్: ఉద్యోగులకు కడిపికొండలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కొందరు కబ్జాదారులు చేస్తున్న అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం అడ్డుకొని, వారిపై చర్యలు తీసుకోవాలని టీఎన్జీఓస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆ సంఘం భవన్‌లో గురువారం జరిగిన యూనియన్ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఉద్యోగుల ఇంటి నిర్మాణాల కోసం కడిపికొండలో ప్రభుత్వం కేటాయించిన 32 ఎకరాల స్థలంలో కొందరు కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఈ నిర్మాణాలను వెంటనే అడ్డుకోవాలని, లేనిపక్షంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాల చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరి వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేశ్, కేంద్ర సంఘం నాయకులు శనిగరపు శ్యామ్‌సుందర్, రామునాయక్, సారంగపాణి, మొయిన్, లక్ష్మి ప్రసాద్, జిల్లా నాయకులు సలీం, చీకటి శ్రీనివాస్, రాజమౌళి, బింగి సురేశ్, రాజేశ్, ఖన్నా, రాజ్యలక్ష్మి, జయంతి, పావని, రజిత, కల్పన, రామ్‌ప్రసాద్, రాజీవ్, భరత్ పాల్గొన్నారు.

పిచ్చివాడైన కొడుకు.. తల్లడిల్లిన తల్లి హృదయం

- తట్టుకోలేక పోలీసులను ఆశ్రయించడంతో చేరదీసిన పోలీసులు
- వైద్యం ఇప్పించడంతో సాధారణ వ్యక్తిగా మార్పు


నరేశ్‌ను తల్లి సమ్మక్కకు అప్పగిస్తున్న పరకాల పోలీసులు

పరకాల: కట్టుకున్న భార్య కాపురానికి రాకపోవడంతో బాధపడుతూ కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా సంచరిస్తున్న యువకుడిని చేరదీసిన పరకాల పోలీసులు వైద్యం చేయించి సాధారణ వ్యక్తిగా మార్చారు. తిరిగి ఆ యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలోకి వెళ్తే.. నడికూడ మండలం రాయపర్తి గ్రామానికి చెందిన కోడెపాక నరేశ్ దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లి తిరిగిరాలేదు. భార్య రావడం లేదంటూ మనోవేదనకు గురైన నరేశ్ మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో సంచరిస్తూ ఉండేవాడు. కళ్ల ముందు కొడుకు అలా తిరుగుతుంటే తట్టుకోలేకపోయిన తల్లి సమ్మక్క పరకాల పోలీసులను ఆశ్రయించింది. పరకాల సీఐ పుల్యాల కిషన్ నరేశ్‌ను ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. నరేశ్ వారం రోజులకు సాధారణ వ్యక్తిగా మారాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన అతడిని తిరిగి తల్లి సమ్మక్కకు అప్పగించడంతో ఆమెలో ఎనలేని సంతోషం కనిపించింది. తిరిగి తన కొడకును ఇలా చూస్తానని అనుకోలేదని ఆమె కన్నీటి పర్యంతమైంది. ఎలాంటి సమస్య ఉన్నా పోలీసులు అండగా ఉంటారని సమ్మక్కకు సీఐ కిషన్, ఎస్ఐలు ప్రశాంత్‌బాబు, హరికృష్ణ, శివకృష్ణ ధైర్యం కల్పించారు. పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు ఆరుగురు మతిస్థిమితం లేని వ్యక్తులను ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించి సాధారణ వ్యక్తులుగా మార్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ పుల్యాల కిషన్ తెలిపారు.